# కాంగ్రెస్‌కు చాన్స్ ఎందుకివ్వాలి?



అక్కన్నపేట: సరిరాం తండాలో గిరిజన వృద్ధులతో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

- ఆ పార్టీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి స్కామ్‌లతో కాలం వెల్లదీశారు
- నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ సర్కారు ఎన్ని నిధులిచ్చిందో చెప్పాలి
- ఎన్నికల తర్వాత గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాం
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్

అక్కన్నపేట, అక్టోబర్ 25: తెలంగాణలో 60 ఏండ్లలో ప్రతిపక్ష పార్టీలు చేయని అభివృద్ధిని, బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం తొమ్మిదేండ్లలోనే చేసి చూపారని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గండిపల్లి, పంచరాయితండా, అంబతండా, డాక్యతండా, సరిరాం తండా, రామవరం, బంగారులొొదితండా, చౌటకుంటతండా, కుందనివానిపల్లి, మబ్బుకుంట, మైసమ్మవాగుతండా, బొడిగపల్లి, గౌరవెల్లి, కెప్టెన్ కాలనీ, జనగామ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు అధికార దాహంతో ఉన్నాయని, ఎన్నికలప్పుడే ఓట్ల కోసం ప్రజలు వాళ్లకు గుర్తుకు వస్తారన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఆగమాగం అవుతున్నాయని, జాగ్రత్తగా ఓట్లు వేసి బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల శ్రేయస్సు, సంక్షేమాన్ని విస్మరించి, అన్నింట్లో స్కాంలకు తెరలేపుతూ కాలం వెల్లదీశారన్నారు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ఒక్క చాన్స్ అంటూ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోఉన్న హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ని వేల కోట్ల నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మాయ మాటలు చెబుతూ తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా లక్షా ఆరువేల ఎకరాలకు సాగునీరు అందుతున్నదన్నారు. దీంతో హుస్నాబాద్ మెట్టప్రాంతం సస్యశ్యామలంగా మారి మూడు పంటలు పండుతాయన్నారు. దశాబ్దాల నాటి ఈ ప్రాంత ప్రజల ప్రాజెక్ట్ కలను ప్రతిపక్ష పార్టీలు ఆగం చేశాయన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభిస్తే ఓట్లు పడవని, రాజకీయ కుట్రతో తుది దశలో ఉన్న ప్రాజెక్ట్‌పై కేసులు వేసి ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్ట్ విషయంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదురుకొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏదేమైనా ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పి, డిపాజిట్లు గల్లంతయ్యేలా చేయాలని పిలుపునిచ్చారు. తనను మూడోసారి ఆశీర్వదించి, కారు గుర్తు ఓటేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు, కేటాయించిన నిధులను గ్రామాల వారీగా వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులకు జీవం పోసిందని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, జడ్పీటీసీ భూక్యా మంగ, మండల ఇన్‌చార్జిలు మ్యాక నారాయణ, కాసర్ల అశోక్‌బాబు, లింగాల సాయన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలూనాయక్, రామచంద్రం, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కందుల రాంరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామాధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- బాహాటంగా యువకుల మద్దతు
- ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలి
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలి
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 25: మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తున్నదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో ప్రచారం చేస్తున్న క్రమంలో యువకులే బాహాటంగా బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని చెబుతున్నారని తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక స్టార్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే మూడుగంటలే కరెంటు ఇస్తామని అమెరికాలో రేవంత్ చెప్పిన మాటలను రైతులకు విడమరిచి చెప్పాలని తెలిపారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో స్వయంగా వ్యవసాయ మంత్రి ఐదుగంటల కంటే ఎక్కువ కరెంటు ఇవ్వలేమని చేతులెత్తేసిన సందర్భాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలిచ్చిన విషయాన్ని ఠాణాలో పోలీసులను, గ్రామ పంచాయతీలో కార్యదర్శులను, దవాఖానలో డాక్టర్లను అడిగితే తెలుస్తుందని చెప్పారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. వారి ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై ప్రజలకు వివరించాలని సూచించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రూపొందించి అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నదని స్పష్టం చేశారు. ఆర్థికంగా ప్రతి రైతు ఎదిగినందువల్లే తన స్వగ్రామమైన ఓ చిన్న గ్రామంలో ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్లను కొనుగోలు చేయగలిగారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. ప్రతి కార్యకర్త కూడా మనస్పర్థలను పక్కన పెట్టి సమన్వయంతో పని చేయాలని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు విడమరిచి చెప్పాలన్నారు. పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపైనే ఉన్నదని గుర్తు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, పార్టీ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

# ఆపద మొక్కులోళ్లను నమ్మద్దు

- మోసపోతం.. గోస పడుతం
- కాంగ్రెస్‌వి అన్నీ పగటి కలలే
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- వెల్గటూర్‌లో ఇంటింటా విస్తృత ప్రచారం



వెల్గటూర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, అక్టోబర్ 25: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటున్నది. వాళ్లవన్నీ ఆపద మొక్కులే. గెలిచేదాక ఓ మాట.. గెలిచిన తర్వాత మళ్లీ పాత కథే అవుతుంది. వాళ్ల పాలన మనకు కొత్తనా.. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏండ్లకేండ్లు పాలించారు. ఏమైనా చేశారా..? నేనొక్కటే అడుగుతున్నా.. అధికారంలో ఉండి చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? నమ్మితే మోసపోతం. మళ్లీ గోసపడుతం. జాగ్రత్త' అంటూ ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు సూచించారు. 'కొందరు కాంగ్రెస్ నాయకులైతే అప్పుడే గెలిచి అధికారం చేపట్టినట్టు పగటి కలలు కంటున్నరు. 'ఆలూ లేదు.. సూలు లేదు కొడుకు పేరు గోవింద' అన్నట్లు ఉంది వారి పరిస్థితి. నేనొక్కటే చెబుతున్నా.. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నరని చెప్పారు. వెల్గటూర్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ సారే గెలువాలన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని 50 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెసోళ్లకు పేద ప్రజలకు సాయం చేయాలని సోయే లేదని, కేవలం వారిని ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారని మండిపడ్డారు. ఇక కొందరు నాయకులు పని గట్టుకుని దళితబంధుపై లేనిపోని అసత్య ప్రచారం చేస్తున్నారని, దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని, వచ్చే 5 ఏండ్లలో రాష్ట్రంలోని దళితులందరికీ రూ.10 లక్షల చొప్పున సాయం అందజేస్తామని తెలిపారు. ఇంకా కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కాగానే 'ఇంటింటికీ కేసీఆర్ బీమా–ప్రజలందరికీ దీమా' కింద ప్రతి కుటుంబానకి రూ.5 లక్షల బీమా, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, ఆసరా పింఛన్ రూ.5 వేలు, రైతుబంధు కింద రూ.16 వేలు, ప్రతి మహిళకు సౌభాగ్య లక్ష్మి కింద రూ.3016, మహిళలకు రూ.400 గ్యాస్ సిలిండర్ అందిస్తామని వివరించారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్త గుండా జగదీశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఉత్సాహపరిచారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు జోలి దేవ్‌రాజ్ సతీమణి అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌ను గెలిపించాలంటూ ఓటర్లకు మ్యానిఫెస్టో అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

# ప్రజాసంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

హుస్నాబాద్‌టౌన్,అక్టోబర్ 25: ప్రజాసంక్షేమంకోసం నిరంతరం కృషిచేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌ను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని ఈ ఎన్నికల్లో మచ్చలేని మహానాయకుడు వొడితల సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్‌ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గూళ్ల రాజు, పెరుక భాగ్యారెడ్డి, బీఆర్ఎస్‌పట్టణ మహిళా అధ్యక్షురాలు బండి పుష్ప, మున్సిపల్ కోఅప్షన్‌సభ్యుడు ఎండీ అయూబ్, మాజీ కౌన్సిలర్ పచ్చిమట్ల ప్రతిభ, బీఆర్ఎస్‌నాయకులు ముప్పిడి రాజిరెడ్డి, బొల్లి శ్రీనివాస్, బొల్లం నవీన్‌కుమార్, పూదరి శ్రీనివాస్, పూదరి సంపత్, సదానందంతోపాటు పలువురు పాల్గొన్నారు.